గిరిజనులకు రాచబాట


సుందరకోట నుంచి అసనగిరి గ్రామానికి కాలినడకన వెళ్తున్న కలెక్టరు రవి పట్టన్‌శెట్టి (ఫైల్)

- కలెక్టరు చొరవతో రహదారి సమస్య పరిష్కారం
- రూ.25 లక్షలతో కొండల్లోంచి పూర్తయిన గ్రావెల్ రోడ్డు
- రూ.28 లక్షలతో ఇంటింటికీ కుళాయిలు
- సుందరకోట గ్రామ పంచాయతీ ప్రజల ఆనందం

నాతవరం: కలెక్టరు చొరవతో గిరిజన గ్రామాలకు రవాణా కష్టాలు తప్పాయి. రూ.25 లక్షలతో కొండలోంచి కొత్త రోడ్డు వేయడంతో స్వగ్రామంలోనే ప్రభుత్వ సంక్షేమ పథకాలు నేరుగా పొందుతున్నారు. దశాబ్దాలుగా తాము పడిన కష్టాలకు వైఎస్సార్‌సీపీ పాలనలో మోక్షం కలగడంతో గిరిజనులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

మండలంలో సుందరకోట పంచాయతీ పూర్తిగా దట్టమైన కొండల నడుమ ఉంది. మొదట్లో సరుగుడు పంచాయతీ పరిధిలో శివారు గ్రామంగా ఉండేది. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మేజరు పంచాయతీలు విభజన చేయడంతో సుందరకోట నూతన పంచాయతీగా ఏర్పడింది. ఈ పంచాయతీలో అసనగిరి, శిరిపురం, తోరడ, కొత్త దద్దుగుల, ముంతమామిడిలొద్దు, బమ్మిడికలొద్దు, కొత్త లంకలు శివారు గ్రామాలుగా ఉన్నాయి. ఆయా గ్రామాలన్నీ నాతవరం మండల కేంద్రానికి 25 కిలోమీటర్ల దూరంలో కొండల మీద ఉన్నాయి. సుందరకోట గ్రామం వరకే రోడ్డు సదుపాయం ఉంది. మిగతా శివారు గ్రామాలకు లేక కొండల మీద నుంచే రాకపోకలు సాగిస్తుంటారు. ఈ నేపథ్యంలో సుందరకోట గ్రామాన్ని గతేడాది కలెక్టరు రవి పట్టన్‌శెట్టి ఆకస్మికంగా సందర్శించారు. అక్కడ నుంచి మూడున్నర కిలోమీటర్ల మేర అసనగిరి గ్రామానికి కాలినడకన వెళ్లారు. కనీసం ద్విచక్ర వాహనం సైతం వెళ్లలేని పరిస్థితి ఉండటంతో చలించిపోయారు. గ్రామస్తుల స్థితిగతులను స్వయంగా పరిశీలించారు. గిరిజనుల కోరిక మేరకు రోడ్డు ఏర్పాటు చేస్తానని, తాగునీటి సమస్యతోపాటు అర్హులైన వారికి సంక్షేమ పథకాలు అందేలా చేస్తానని హామీ ఇచ్చారు.


సుందరకోట నుంచి అసనగిరి మధ్య రూ.25 లక్షలతో ఏర్పాటు చేసిన గ్రావెల్ రోడ్డు

రూ.2.5 కోట్లతో తారురోడ్డు నిర్మాణానికి టెండర్ల ఖరారు

కలెక్టరు ఇచ్చిన మాట ప్రకారం సుందరకోట నుంచి అసనగిరికి రూ.25 లక్షలతో గ్రావెల్ రోడ్డు ఏర్పాటు చేయించారు. దీన్ని తారురోడ్డుగా మార్చేందుకు పంచాయతీ రాజ్ శాఖ ప్రాజెక్టు వర్క్స్ ద్వారా రూ.2.5 కోట్లు మంజూరు చేసి టెండర్ల ప్రక్రియ పూర్తి చేశారు. త్వరలో పనులు ప్రారంభం కానున్నాయి. ఈ పనులు పూర్తయితే కొత్త లంకలు, కొత్త దద్దుగులు, అసనగిరి, సుందరకోట గ్రామాలకు వాహనాలపై రాకపోకలు సాగించవచ్చు.


సుందరకోటలో నిర్మాణ దశలో పాఠశాల భవనం

అసనగిరిలో తాగునీటి సమస్య పరిష్కారం కోసం **రూ.28 లక్షలు మంజూరు** చేశారు. ఇటీవల టెండర్లు పూర్తి చేశారు. ఈ వేసవిలో పనులు ప్రారంభిస్తారు. **అసనగిరిలో** అంగన్‌వాడీ కేంద్రానికి నూతన భవనం మంజూరు చేశారు. అర్హత కలిగిన వారికి పింఛన్లు, రైతు భరోసా సాయం, అమ్మఒడి, వైఎస్సార్ చేయూత, అటవీ హక్కు పత్రాలు మంజూరు చేశారు. ఆయా పథకాలు అందించేందుకు ఎమ్మెల్యే పెట్ల ఉమా శంకర్ గణేష్ విశేష కృషి చేశారు. సుందరకోట పాఠశాల భవనానికి నిధులు మంజూరు చేయడంతో నిర్మాణం పూర్తయి రంగులు వేస్తున్నారు. సంక్షేమ పథకాలు అందించేందుకు సిగ్నల్స్ సమస్య ఉండటంతో కొత్త టవరు ఏర్పాటుకు ప్రతిపాదనలు చేశారు. రెవెన్యూ అధికారులు ఇటీవల స్థలాన్ని పరిశీలించారు

ఇచ్చిన మాట నిలబెట్టుకున్నారు



గతేడాది కలెక్టరు సందర్శించి మొదటగా అసనగిరికి గ్రావెల్ రోడ్డు సదుపాయం కల్పించారు. తారురోడ్డు నిర్మాణానికి రూ.2.5 కోట్లు మంజూరు చేశారు. నేను 2013 నుంచి ఉమ్మడి సరుగుడు పంచాయతీ సర్పంచ్‌గా పని చేశాను. అప్పట్లో గిరిజనులకు కనీసం మేలు చేయలేకపోయాను. ఇప్పుడు సంక్షేమం, అభివృద్ధి చేయడం చాలా సంతోషంగా ఉంది.

– సాగిన లక్ష్మణమూర్తి, ఎంపీపీ, సరుగుడు గ్రామం

బైక్‌పై రాకపోకలు సాగిస్తున్నాం



రోడ్డు వేయకముందు సుందకోట నుంచి అసనగిరికి వెళ్లాలంటే కొండల మీద నుంచి నడిచి వెళ్లేవాళ్లం. వృద్ధులు, దివ్యాంగుల అవస్థలైతే వర్ణనాతీతం. ప్రస్తుతం అసనగిరి గ్రామానికి ద్విచక్ర వాహనాలపై, ఆటోల్లో దర్జాగా వెళ్లి వస్తున్నాం. కొండల మీదనున్న గ్రామానికి రోడ్డు సదుపాయం కల్పిస్తారని కలలోనూ అనుకోలేదు. కలెక్టరుకు, ఎమ్మెల్యే గణేష్‌కు కృతజ్ఞతలు.

– కొండపల్లి రాజా, సిరిపురం గ్రామం

క్లుప్తంగా

చురుగ్గా రామాలయ నిర్మాణం


నిర్మాణ దశలో రామాలయం

గొలుగొండ: నాగాపురంలో రామాలయ నిర్మాణ పనులు చురుగ్గా సాగుతున్నాయి. ఆలయ నిర్మాణం కోసం టీటీడీ నుంచి రూ.10 లక్షలు మంజూరు కావడంతో సర్పంచ్ యలమంచిలి రఘురాం ఆధ్వర్యంలో పనులు చేస్తున్నారు. దీనికితోడు గ్రామస్తులు సైతం సహాయ సహకారాలు అందించడంతో త్వరితగతిన పూర్తి చేస్తామని ఆయన తెలిపారు. ఆలయ నిర్మాణం కోసం నిధులు మంజూరు చేయించిన నర్సీపట్నం ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్‌కు గ్రామస్తుల తరఫున కృతజ్ఞతలు తెలిపారు.

స్వయంభూ వరాహలక్ష్మీ నృసింహస్వామికి పూజలు


స్వామివారిని దర్శించుకుంటున్న రమణమ్మ, తదితరులు

చీడికాడ: అర్జునగిరిలో వెలసిన స్వయంభూ శ్రీదేవి, భూదేవి సమేత వరాహలక్ష్మీ నృసింహ స్వామి వారిని డిప్యూటీ సీఎం బూడి ముత్యాల నాయుడు సతీమణి రమణమ్మ ఆదివారం మధ్యాహ్నం దర్శించుకున్నారు. ఇక్కడ స్వామివారి కల్యాణోత్సవాల్లో భాగంగా అన్న సమారాధన కార్యక్రమానికి తమ వంతు సహకారంగా సర్పంచ్ బి.రమాదేవి, పెద్దలకు రూ.5 వేలు అందజేశారు. జెడ్పీటీసీ లాలం శారదా జానకీరాం, వైఎస్సార్‌సీపీ టీచర్స్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు చిరికి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

గుల్లేపల్లిలో గడ్డివాము దగ్ధం


మంటలను అదుపు చేస్తున్న అగ్నిమాపక సిబ్బంది

కె.కోటపాడు: గుల్లేపల్లిలో గడ్డివాము అగ్నికి ఆహుతైంది. ఆదివారం ఇక్కడ రైతు బి.తాతయ్యకు చెందిన గడ్డివాముకు మంటలంటుకుని కాలిపోయింది. తొలుత రైతులు మంటలను అదుపు చేసేందుకు యత్నించినా ఫలితం లేకపోవడంతో చోడవరం అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇచ్చారు. వారొచ్చి మంటలను అదుపు చేశారు. రూ.20 వేల నష్టం వాటిల్లినట్టు అంచనా వేశారు.

ఆహ్లాదకరంగా శాంతిపార్కు


శాంతిపార్కులో చిన్నారులు, పెద్దల సందడి

అనకాపల్లి : స్థానిక శారదానది ఒడ్డున శాంతి పార్కుల చిన్నారులతో ఆదివారం కళాకళాలాడింది. రెండు రోజుల క్రితం రాష్ట్ర మంత్రి గుడివాడ అమర్‌నాథ్ పార్కును ప్రారంభించారు. వేసవిని దృష్టిలో పెట్టుకుని పార్కును అభివృద్ధి చేయాలని జీవీఎంసీ రూ.49 లక్షలు, ఎంపీ నిధులు రూ.10 లక్షల నిధులతో అభివృద్ధి చేసిన విషయం తెలిసిందే. 82వ వార్డు కార్పొరేటర్ మందపాటి సునీత ఆధ్వర్యంలో పార్కును అభివృద్ధి చేయడంతో పట్టణ పరిధిలో చిన్నారులు, వృద్ధులు, యువకులు పార్కును చూసి ఎంతగానో ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

అక్రమ మద్యం కేసులో ఒకరి అరెస్టు

కశింకోట : కన్నూరుపాలెంలో మద్యం సీసాలు తరలిస్తుండగా ఆదివారం ఓ వ్యక్తిని పట్టుకున్నట్టు ఎస్‌ఐ ఎం.రమేష్‌బాబు తెలిపారు. 11 క్వార్టర్ మద్యం సీసాలు స్వాధీనం చేసుకొని నిందితుడు వెంకునాయుడును అరెస్టు చేశామన్నారు.

ఘనంగా మోదకొండమ్మ పాదాలు తీర్థం


మోదకొండమ్మ పాదాలను దర్శించుకుంటున్న ఎంపీపీ రాజారామ్ తదితరులు

మాడుగుల: ఒమ్మలి చెరకు తూనిక కేంద్రం వద్ద వెలసిన మోదకొండమ్మ పాదాలు తీర్థం ఆదివారం ఘనంగా జరిగింది. ఇందులో భాగంగా మహిళల కోలాటాల ప్రదర్శన చూపరులను విశేషంగా ఆకట్టుకుంది. ఈ సందర్భంగా ఎంపీపీ తాళ్లపురెడ్డి వెంకట రాజారామ్‌తోపాటు అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.

మోదకొండమ్మకు ప్రత్యేక పూజలు

మాడుగుల: ఉత్తరాంధ్రుల ఇలవేల్పు స్థానిక మోదకొండమ్మ ఆలయానికి ఆదివారం భక్తులు తాకిడి పెరిగింది. ఇక్కడ తెల్లవారు నుంచి ప్రత్యేక కుంకుమ పూజల్లో పాల్గొన్నారు. అమ్మవారికి భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. ఆలయ కమిటీ సభ్యులు తాగునీరు, ప్రసాదం అందజేశారు.

వైభవంగా అమ్మవార్ల ఒడ్డు పండగలు

మాడుగుల రూరల్: గ్రామ దేవతల ఒడ్డు పండగలు ఆదివారం పలు గ్రామాల్లో ఘనంగా నిర్వహించారు. కె.జె.పురంలో మోదకొండమ్మ, నూకాంబిక అమ్మవార్ల ఒడ్డు పండగల సందర్భంగా భక్తులు ఘటాలతో ఊరేగింపుగా వచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. ఘాట్‌రోడ్డు జంక్షన్‌లో మోదకొండమ్మ, సాగరం, సురవరం, తదితర గ్రామాల భక్తులు ఘటాలు ఊరేగింపుగా తీసుకొచ్చి అమ్మవారికి సమర్పించారు.

వైఎస్సార్‌సీపీకి అధిక మెజార్టీ వచ్చేలా కృషి చేయాలి


రామధర్మజను సత్కరిస్తున్న జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్, మహిళా అధ్యక్షురాలు అనురాధ

దేవరాపల్లి/మాడుగుల: వైఎస్సార్‌సీపీ మాడుగుల మండలాధ్యక్షుడిగా వేమవరపు రామధర్మజ (పెద బాబు)ను నియమించినట్లు పార్టీ జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్ ప్రకటించారు. సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి, ఉత్తరాంధ్ర రీజనల్ కోఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి ఆదేశాల మేరకు రామధర్మజను పార్టీ మండలాధ్యక్షుడిగా నియమించామన్నారు. ఈ మేరకు ఆదివారం తారువ క్యాంప్ కార్యాలయంలో సన్మాన కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. మాడుగుల నియోజకవర్గాన్ని వైఎస్సార్‌సీపీ కంచుకోటగా తీర్చిదిద్దిన డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు నాయకత్వంలో కష్టపడి పని చేసి గతం కంటే ఎక్కువ మెజార్టీ సాధించేలా కృషి చేయాలని సూచించారు. అనంతరం జిల్లా మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు ఈర్లె అనురాధతో కలిసి రామధర్మజను ఘనంగా సత్కరించారు. కె.కోటపాడు ఎంపీపీ రెడ్డి జగన్‌మోహన్, దేవరాపల్లి జెడ్పీటీసీ కర్రి సత్యం, మండలాధ్యక్షుడు బూరె బాబురావు తదితరులు శుభాకాంక్షలు తెలిపారు.

నేడు ఉచిత గుండె వైద్య శిబిరం

చోడవరం రూరల్: స్థానిక సంజీవనీ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ (సుందర రామం ఆస్పత్రి)లో నేడు ఉచిత గుండె వైద్య శిబిరాన్ని నిర్వహించనున్నట్టు ఆస్పత్రి వర్గాలు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నాయి. ఉదయం 10 గంటలకు ప్రారంభమయ్యే శిబిరంలో ఎత్తు, బరువు, బీపీ, ఆర్బీఎస్, ఈసీజీ, 2డీ ఎకో పరీక్షలతోపాటు వైద్యుల సిఫారసుతో పలు పరీక్షలను ఉచితంగా నిర్వహిస్తామని తెలిపారు. ఇంటర్వెన్షనల్ కార్డియాలజిస్ట్ సి.హెచ్.ఎన్.రాజు హృద్రోగులకు పరీక్షలు చేస్తారని, విశాఖలోని మెడికవర్ హాస్పిటల్స్ సహకారంతో వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్టు తెలిపాయి.

ఆదమరిస్తే అంతే సంగతులు!

ఇంకుడు గుంత తీసి.. పనుల మరచిన వైనం


గిరిజన ఆశ్రమ పాఠశాలలో అసంపూర్తిగా ఇంకుడు గుంత నిర్మాణం

నాతవరం: రామన్నపాలెం గిరిజన ఆశ్రమ పాఠశాలలో ఇంకుడు గుంత తీసి అసంపూర్తిగా వదిలేయడంతో ప్రమాదకరంగా దర్శనమిస్తోంది. ఇక్కడ కుళాయి వాడుక నీటిని భూమిలో ఇంకేందుకు ఉపాధి హామీ నిధులతో ఇంకుడు గుంత తవ్వారు. 15 అడుగుల లోతులో తవ్వేసి పనులు పూర్తి చేయకుండా నెలలు తరబడి వదిలేయడంతో ప్రమాదకరంగా మారింది. విద్యార్థులు ఆదమరిచి ఏమాత్రం అజాగ్రత్తగా ఉన్నా గుంతలో పడిపోయే ప్రమాదముంది. రాత్రిళ్లు విద్యుత్ అంతరాయంలో పొరపాటున పడితే గాయపడటం ఖాయ మని భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి గుంత నిర్మాణం పూర్తి చేయాలని కోరుతున్నారు.

రూ.48 లక్షలతో వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయ పునర్నిర్మాణం

- అవసరమైతే మరిన్నీ నిధులు తీసుకువస్తా
- నర్సీపట్నం ఎమ్మెల్యే గణేష్


నిధులు మంజూరు పత్రాన్ని సంఘ ప్రతినిధులకు అందజేస్తున్న ఎమ్మెల్యే గణేష్

నర్సీపట్నం: పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయ పునర్నిర్మాణానికి ప్రభుత్వం రూ.48 లక్షలు మంజూరు చేసిందని ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ పేర్కొన్నారు. వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో విశ్వబ్రాహ్మణ సంఘం ప్రతినిధులతో ఆదివారం ఆయన సమావేశమయ్యారు. ఆలయ పునర్నిర్మాణ విషయాన్ని సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి దృష్టిలో పెట్టగా, శనివారం రూ.48 లక్షలు మంజూరు చేస్తూ ప్రభుత్వం జీవో జారీ చేసిందన్నారు. త్వరితగతిన పనులు మొదలు పెట్టేందుకు అవసరమైన ప్రక్రియను పూర్తి చేయాలని ఇంజనీరింగ్ అధికారులకు సూచించారు. మాట ఇచ్చానంటే తప్పనిసరిగా చేస్తానన్నారు. ఒకే ఒకసారి తన దృష్టికి తీసుకొచ్చారని, అందరిలా మాటలు చెప్పే వ్యక్తిని కాదని, పని చేసి చూపించడమే తననైజం అన్నారు. నిధులు సరిపోకపోతే మరిన్నీ తీసుకువస్తానని సంఘం ప్రతినిధులకు హామీ ఇచ్చారు. అనంతరం నిధులు మంజూరు పత్రాన్ని సంఘ ప్రతినిధులు పెదపాటి గోవిందరావు, నాగేశ్వరరావులకు అందజేశారు. కొన్నేళ్లుగా అభివృద్ధికి నోచుకోని ఆలయానికి ఎమ్మెల్యే గణేష్ చొరవతో పూర్వ వైభవం రానుందని సంఘ ప్రతినిధి గోవిందరావు పేర్కొన్నారు. అనంతరం ఎమ్మెల్యేను ఘనంగా సత్కరించారు. ముందుగా వీరబ్రహ్మేంద్రస్వామి దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్లు కోనేటి రామకృష్ణ, తమరాన అప్పలనాయుడు, పార్టీ టౌన్ అధ్యక్షుడు ఏకా శివ, నూకాలమ్మ దేవాలయం చైర్మన్ ధనిమిరెడ్డి నాగు, మున్సిపాలిటీ యూత్ అధ్యక్షుడు ధనిమిరెడ్డి ప్రసాద్, పార్టీ నాయకులు బేతిరెడ్డి విజయ్ తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక


కామేశ్వరమ్మ ఆలయం వద్ద కలుసుకున్న పూర్వ విద్యార్థులు

మాకవరపాలెం: పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక ఉల్లాసంగా సాగింది. స్థానిక ఉన్నత పాఠశాలలో 1994–95 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదివిన విద్యార్థులంతా రాచపల్లి జంక్షన్‌లో కామేశ్వరమ్మ ఆలయం వద్ద ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా వారంతా చిన్ననాటి జ్ఞాపకాలను నెమరువేసుకుంటూ ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆనందంగా గడిపారు. ఒకరికొకరు యోగక్షేమాలతోపాటు ప్రస్తుతం వారు స్థిరపడిన రంగాలను తెలుసుకున్నారు. కార్యక్రమంలో 50 మంది పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

కింతలి హైస్కూలులో...


కింతలి హైస్కూల్‌లో ఒక చోట చేరిన పూర్వ విద్యార్థులు

మాడుగుల: కింతలి జెడ్పీ హైస్కూల్‌లో 1989–90 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదువుకున్న విద్యార్థులంతా సందడి చేశారు. తాము చదువుకున్న స్కూల్‌లోనే ఆదివారం ఆత్మీయంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా చిన్ననాటి చిలిపి చేష్టలు గుర్తుకు తెచ్చుకుని మురిసిపోయారు. ఇదే పాఠశాలలో చదువుకుని ఉపాధ్యాయ వృత్తి చేపట్టిన తోటి మిత్రులను ఏరా ఎలా ఉన్నావ్.. వరే అంటూ ఆప్యాయంగా పలకరించుకున్నారు. ఎవరెవరు ఏయే వృత్తుల్లో స్థిరపడ్డారో తెలుసుకుని ఆనందించారు. అనంతరం తమకు చదువు నేర్పిన ఉపాధ్యాయులు చిన బాబు, రామకృష్ణలకు దుశ్శాలువా కప్పి ఘనంగా సత్కరించి గౌరవించారు.

ప్రభుత్వ విప్ ధర్మశ్రీకే మా మద్దతు

దుష్ప్రచారాన్ని ఖండించిన బుచ్చెయ్యపేట వైఎస్సార్‌సీపీ నేతలు


నీలకంఠాపురంలో మాట్లాడుతున్న జెడ్పీటీసీ, ఎంపీపీ

బుచ్చెయ్యపేట: ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీకే తమ మద్దతు అని, రెండో సారి అత్యధిక మెజార్టీతో గెలిపించి జగనన్నను మరోసారి ముఖ్యమంత్రిని చేయడానికి సిద్ధంగా ఉన్నామని బుచ్చెయ్యపేట మండలం వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు స్పష్టం చేశారు. ఆదివారం రాత్రి నీలకంఠాపురంలో జెడ్పీటీసీ దొండా రాంబాబు,ఎంపీపీ దాకవరపు నాగేశ్వరిదేవి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఇటీవల కొంతమంది ప్రభుత్వ విప్ ధర్మశ్రీ విజయానికి ఆటంకాలు కలిగేలా దుష్ప్రచారాలు చేయడాన్ని తీవ్రంగా ఖండించారు. ఇలాంటివి ఎవ్వరూ నమ్మవద్దన్నారు. ఆదివారం విశాఖ నగరంలో ఐటీ శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్, పార్టీ జిల్లా అధ్యక్షుడు బొడ్డేటి ప్రసాద్, విశాఖ డెయిరీ చైర్మన్ ఆడారి ఆనందబాబు, ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీలతో బుచ్చెయ్యపేట మండల నాయకులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు సమావేశమయ్యామన్నారు. పార్టీ విజయానికి ఢోకా లేదని, ముఖ్యమంత్రి జగనన్నను, ప్రభుత్వ విప్ ధర్మశ్రీని రెండోసారి గద్దె నెక్కించడానికి ప్రతి ఒక్కరూ సైనికుల్లా పనిచేయాలని సమష్టిగా నిర్ణయించామన్నారు. అనివార్య కారణాల వల్ల పార్టీ మండలాధ్యక్షుడు జోగా కొండబాబు రాజీనామా చేయగా, అధిష్టానం ఎవరిని నియమించినా గౌరవించాలన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ దొండా లలితా నారాయణమూర్తి, డీసీసీబీ మాజీ డైరెక్టర్ కోవెల జనార్దనరావు, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు బుదిరెడ్డి అప్పారావు, సర్పంచ్‌లు ఎల్లపు విజయ్‌కుమార్, గోపిశెట్టి శ్రీను, పడాల నాగభూషణం, ముచ్చకర్ల శ్రీను, నాయకులు గొంపా అప్పారావు, కోవెల ఈశ్వరరావు, యెనుముల వాసు, ధరిమిశెట్టి అప్పలనాయుడు, శానాపతి నాయుడు, పుణ్యగిరి నాయుడు, గుడాల ఆనంద్ పాల్గొన్నారు.

చురుగ్గా రోడ్ల నిర్మాణ పనులు

- రూ.26.60 కోట్లతో 24.6 కిలోమీటర్ల మేర నిర్మాణం
- తాచేరు, గొరిగెడ్డలపై వంతెనలకు శ్రీకారం


ఎ. వీరనారాయణం - కొండవీధికి మధ్యలో గొరిగెడ్డపై వంతెన నిర్మాణం


జాలంపల్లి పంచాయతీ కామకూటం రోడ్డు నిర్మాణం

మాడుగుల: మండలంలో నూతన రోడ్ల నిర్మాణాలు చురుగ్గా సాగుతున్నాయి. దశాబ్దాలు తర్వాత ఐదు రోడ్ల నిర్మాణాలకు నిధులు మంజూరు కావడంతో 30 గ్రామాల ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. కింతలి, ఘాట్‌రోడ్ పనులు మేజర్ డిస్ట్రిక్ట్ రోడ్డు నిధుల నుంచి రూ.9 కోట్లు మంజూరుకాగా 9.680 కిలోమీటర్ల మేర రోడ్డు నిర్మిస్తున్నారు. ఎ.వీరనారాయణం నుంచి వయా పెద గొరిగెడ్డ మీదుగా కొండవీధికి రోడ్డుతోపాటు వంతెన నిర్మాణ పనులు (ఎన్‌ఆర్‌జీఎస్) రూ.1.20 కోట్లతో చేస్తున్నారు. మాడుగుల నుంచి తాచేరుపై వంతెనతోపాటు, వయా సాగరం కాలనీ మీదుగా డి. గొలివాడ వరకు పీఎంజీఎస్‌వై నుంచి రూ.7.40 కోట్లతో రోడ్డు రోడ్డు పనులు జరుగుతున్నాయి. రావిపాలెం నుంచి పెద్దేరు జలాశయం పక్క నుంచి కొండ బాటలో సిరిపురం వరకు 3.8 కిలోమీటర్ల మేర రోడ్డు నిర్మాణాన్ని రూ.5.60 కోట్లు(ఏపీఆర్ఆర్పీ)తో చేస్తున్నారు. ఎల్.కృష్ణాపురం నుంచి కామకూటం గ్రామానికి చిన్న వంతెనతోపాటు రోడ్డు నిర్మాణానికి (ఏపీఆర్ఆర్పీ)రూ.3.40 కోట్లతో చేస్తున్నారు. ప్రస్తుతం ఈ ఐదు రోడ్లకు రూ.26.60 కోట్లతో 24.6 కిలోమీటర్ల మేర రోడ్లు పనులు జోరుగా సాగుతున్నాయి. 30 గ్రామాల ప్రజలు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి, డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడుకు కృతజ్ఞతలు తెలియజేస్తున్నారు.

సిద్ధం సభకు సన్నద్ధం

కోటవురట్ల : ఎస్.రాయవరం మండలం అడ్డురోడ్డులో సోమవారం మధ్యాహ్నం 3 గంటలకు జరగనున్న వైఎస్సార్‌సీపీ సిద్ధం సభకు మండలంలోని 25 గ్రామ పంచాయతీల నుంచి ఆ పార్టీ శ్రేణులు భారీగా తరలివెళ్లేందుకు ఏర్పాట్లు చేశారు. రానున్న ఎన్నికలలో విజయమే లక్ష్యంగా ముందుకు సాగేందుకు దిశానిర్దేశం చేయనున్నారు. కార్యకర్తలు, నాయకుల్లో సమరోత్సాహం ఉరకలేస్తోంది. సీఎం జగన్ ఇచ్చిన పిలుపునకు మేము సిద్ధమంటూ సై అంటున్నారు.

మండలం నుంచి మాజీ ఎమ్మెల్సీ డి.వి. సూర్యనారాయణరాజు, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి ఆర్.ఎస్ సీతారామరాజు, జెడ్పీటీసీ సిద్ధాబత్తుల ఉమాదేవి, జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు పైల రమేష్, మండల అధ్యక్షుడు కిల్లాడ శ్రీనివాసరావు, జిల్లా కార్యదర్శి యల్లపు కుమారరాజా, పార్టీ నాయకులు సిద్ధాబత్తుల సత్యనారాయణల సారథ్యంలో భారీగా కార్యకర్తలు, సర్పంచులు, ఎంపీటీసీలు తరలివెళ్లేందుకు చర్యలు తీసుకున్నారు.

రూపురేఖలు మారిన వడ్డాది జంక్షన్

బుచ్చెయ్యపేట: పదేళ్లుగా అభివృద్ధికి నోచుకోని వడ్డాది నాల్గు రోడ్ల జంక్షన్ రూపురేఖలు మారిపోయాయి. ఇక్కడ ఆర్అండ్‌బీ రోడ్డుకు నలువైపులా ఆక్రమణలతోపాటు పెద్ద గోతులు ఉండేవి. మురుగు బయటకు పోయేలా కాలువలు ఉండేవి కావు. ఏ మాత్రమూ వర్షం కురిసిన మోకాల లోతు వరకు నీరు నిలిచిపోయి పాదచారులు, వాహనదారులు రాకపోకలకు తీవ్ర అవస్థలు పడేవారు. దుకాణదార్లు, నివాస ప్రాంతాల వారు వాడిన నీరు రోడ్డు మీదకు వచ్చి మురుగు కూపంలా ఉండేది. గత తెలుగుదేశం పార్టీ పాలనలో అప్పటి మంత్రి చింతకాయల అయ్యన్నపాత్రుడుతోపాటు ఇక్కడ ఎమ్మెల్యేగా పని చేసిన కేఎస్ఎన్ఎస్ రాజు, టీడీపీ నాయకులు బీఎన్ రోడ్డును, వడ్డాది నాల్గు రోడ్ల జంక్షన్ రూపురేఖలు మారుస్తామని నిధులు మంజూరు చేశామని పలుమార్లు ప్రకటనలు చేసి శంకుస్థాపనలతో హడావుడి చేశారు. ఆ తర్వాత ఏనాడూ పట్టించుకోలేదు. ఈ నేపథ్యంలో 2019లె వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఇక్కడ నాల్గు రోడ్ల జంక్షన్ అభివృద్ధి చేయాలని మండల, స్థానిక నాయకులు ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ దృష్టికి తీసుకెళ్లారు. ఆయన వెంటనే రూ. 80 లక్షలు మంజూరు చేయించారు. నర్సీపట్నం, చోడవరం, మాడుగుల, వీరవల్లి రోడ్ల వైపు ఆక్రమణలు తొలగించారు. మురుగు బయటకు పోయేలా కాలువలు ఏర్పాటు చేశారు. నాల్గు వైపులా రోడ్లను ఎత్తు చేసి గోతులు పూడ్చి కొత్తగా తారు రోడ్డు వేయడంతో సంతోషం వ్యక్తం చేస్తున్నారు.


ఆక్రమణలు తొలగించాక విశాలంగా మారిన జంక్షన్


నాల్గు రోడ్ల జంక్షన్‌లో వర్షపునీటిలో వాహనదారుల అవస్థలు(ఫైల్)